మల్లాది వెంకటకృష్ణమూర్తి

కథాకళి

# కింగ్ మింగ్

మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచబడ్డ ఆ ఆరుగురు చైనా దేశస్థులు ఇరవై నించి ముప్పై ఏళ్ళ లోపు వయసుగలవారు. వారి కేసు విచారణ సాయంత్రం మూడు పావుకి మొదలైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొంతు సవరించుకుని కేసు స్వరూపం వివరించసాగాడు.

"యువర్ ఆనర్ ఈ ఆరుగురు చైనా దేశస్థులు ఇండియాకి వచ్చి సంవత్సరం దాటిందని వాళ్ళ పాస్‌పోర్టులు తెల్పుతున్నాయి. వీళ్ళు ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థులు. హైదరాబాద్ నగరం చూడటానికి వచ్చి రెండు రోజులైంది. నిన్న రాత్రి పదిన్నరకి అబిడ్స్‌లో తప్పతాగి, చేతిలో బీర్ బాటిల్స్ పట్టుకుని గొడవచేస్తూంటే పోలీసులు పట్టుకున్నారు."

"గొడవంటే?" అడిగాడు మేజిస్ట్రేట్.

"ఒకరి నొకరు కొట్టుకున్నారు"

"ఎవరు ఎవరిని కొట్టారు సరిగ్గా వివరించండి" అడిగాడు మేజిస్ట్రేట్.

కొద్దిగా ఇబ్బందిగా చూసాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. విచారంగా నిట్టూర్చాడు.

"జరిగింది మొదటినించీ చెప్తాను" జేబులోంచి ఓ కాగితం తీసి అందులోని వాళ్ళ పేర్లని చూస్తూ చెప్పసాగాడు.

"చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ మొదట. లింగ్ మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ డార్లింగ్ యాంగ్‌డాంగ్ అనే యువతి గురించి 'క్లుయన్ క్లుయన్' అనే బూతుమాట వుపయోగించి తిట్టాడు. దాంతో లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ తల్లి అయిన షింగ్ మింగ్‌ని 'క్యుయన్ యా క్యూన్' అనే బూతు మాట వుపయోగించి బదులు తిట్టాడు. వెంటనే చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌ని కుంగ్‌ఫూ విద్యతో కొట్టబోతే కుంగ్‌ఫుంగ్ అనే మరో యుద్ధ విద్య తెలిసిన లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ స్నేహితుడైన లంగ్‌ఫుంగ్ అడ్డు రావటంతో ఆ కుంగ్‌ఫూ దెబ్బ లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌కి తగిలే బదులు లంగ్‌ఫుంగ్‌కి తగిలింది. దాంతో లంగ్‌ఫుంగ్ చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌ని కుంగ్‌ఫుంగ్ దెబ్బ కొట్టాడు. అప్పటిదాకా వూరికే వున్న లంగ్‌ఫుంగ్ తమ్ముడు ఫుంగ్‌లంగ్ చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌ని బీర్ బాటిల్‌తో నెత్తి మీద కొట్టాడు. అతనికి దెబ్బ తగిలింది"

"ఎవరికి?" అడిగాడు మేజిస్ట్రేట్ ఓ గ్లాసు నీళ్ళు గబగబా తాగి.



పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన చేతిలోని కాగితం మీంచి దృష్టి మరల్చకుండా చెప్పుకుపోసాగాడు.

"ఇంతకెవరికి? చియాంగ్ చింగ్ కొడుకైన చింగ్ చియాంగ్‌కి. అతను... అంటే చియాంగ్ చింగ్ కొడుకైన చింగ్ చియాంగ్ నెత్తిమీద గాయం అవటంతో తనని బీర్ బాటిల్‌తో నెత్తిమీద కొట్టిన లంగ్‌ఫుంగ్ తమ్ముడయిన ఫుంగ్‌లంగ్ తల్లి కుంగ్‌కుంగ్‌ని చైనాభాషలో 'క్వింగ్ క్వింగ్' అనే బూతు పదం ఉపయోగించి తిట్టాడు. ఈసారి లంగ్‌ఫుంగ్, ఫుంగ్‌లంగ్‌ల తమ్ముడు చింగ్‌కింగ్ చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్‌చియాంగ్ తల్లి షింగ్ మింగ్‌ని చైనా భాషలో 'క్వెన్‌క్వెన్' అనే బూతు మాట వుపయోగించి తిట్టడమే కాక, అతన్ని... అంటే చియాంగ్ చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌ని బలంగా నేలమీదకి తోసి కాలితో తన్నాడు. అప్పుడు లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ చియాంగ్‌చింగ్ కొడుకయిన చింగ్‌చియాంగ్ మీద తన చేతిలోని బీర్ బాటిల్‌లో మిగిలి వున్న బీర్‌ని వలకపోసి, తన స్నేహితుడైన లంగ్‌ఫుంగ్‌ని, అతని ఇద్దరు తమ్ముళ్ళు ఫుంగ్‌లంగ్, చింగ్‌కింగ్‌లని కూడా అతనిమీద... ఐమీన్ చియాంగ్‌చింగ్ కొడుకయిన చింగ్‌చియాంగ్ మీద బీరుని వలకపోయమని చెప్పాడు. దాంతో లంగ్‌ఫుంగ్, అతని ఇద్దరు తమ్ముళ్ళు ఫుంగ్‌లంగ్, చింగ్‌కింగ్‌లు తమ చేతిలోని బీర్ బాటిల్స్‌లోని బీర్‌ని చియాంగ్‌చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్ మీద కుమ్మరించారు. అంతదాకా సంకల్పించుకోని, వాళ్ళందరికన్నా పెద్ద అయిన మింగ్ లంగ్ వాళ్ళందరికి, అంటే చియాంగ్‌చింగ్ కొడుకయిన చింగ్ చియాంగ్‌కి లింగ్‌మంగ్ కొడుకయిన చింగ్‌చియాంగ్‌కి, అతని మిత్రుడు లంగ్‌ఫుంగ్‌కి, మరియు ఫుంగ్‌లంగ్, చింగ్‌కింగ్‌లకి సర్ది చెప్పబోతూంటే వాళ్ళంతా అంటే చియాంగ్‌చింగ్ కొడుకైన, చింగ్ చియాంగ్, లింగ్‌మంగ్ కొడుకైన చింగ్‌చియాంగ్..."

"కేస్ డిస్‌మిస్డ్" చెప్పాడు మేజిస్ట్రేట్ అర్జెంట్‌గా.

*